క్లుప్తంగా

హైవేపై వాహనాల పార్కింగ్‌తో ఇబ్బందులు



జాతీయ రహదారికి ఇరువైపులా నిలిపి ఉంచిన భారీ వాహనాలు

నరసాపురం: స్థానిక రుస్తుంబాద ఓఎన్‌జీసీ టెంపుల్ ల్యాండ్‌వద్ద జాతీయరహదారికి ఇరువైపులా ఓఎన్‌జీసీకి చెందిన భారీ వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. హైవే పక్కనే రుస్తుంబాద ప్రాంతంలో ఓఎన్‌జీసీ టెంపుల్ ల్యాండ్ కార్యాలయం ఉంది. ఓఎన్‌జీసీ సరుకులను భారీ వాహనాలతో ప్రతి రోజు ఇక్కడికి తీసుకొస్తారు. అయితే వాహనాలను నిబంధనలకు విరుద్ధంగా హైవేకు ఇరువైపులా నిలిపి ఉంచుతున్నారు. దీంతో ట్రాఫిక్ విపరీతంగా పెరిగింది. తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. పోలీసుశాఖ దృష్టిపెట్టి పరిస్థితి చక్కదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.

ఆదమరిస్తే ఆసుపత్రికి వెళ్లాల్సిందే!



బస్టాండ్ వద్ద ప్రమాదకరంగా ఉన్న డ్రెయినేజీ

నరసాపురం: స్థానిక బస్టాండ్ వద్ద డ్రెయిన్ ప్రమాదకరంగా మారింది. నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే ఈ మార్గంలో డ్రెయిన్‌పై మూతలు లేవు. దీంతో వాహనచోదకులు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. గత ఏడాది మే నెలలో బస్టాండ్ పక్కనున్న డ్రెయిన్‌ను బాగు చేసి, దానిపై మూతలు తీశారు. పని పూర్తయిన తరువాత, తిరిగి మూతలు ఈ ఏడాది కాలంలో ఏర్పాటు చేయలేదు. మూతలు లేకపోవడంతో ప్రజలు డ్రెయిన్‌లో పడి గాయాల పాలవుతున్నారు. శిథిలమైన ఈ డ్రెయిన్ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ప్రజలు కోరుతున్నారు.

30 లోపు ఈ-కేవైసీ నమోదు చేసుకోవాలి

పెనుగొండ: రేషన్‌కార్డులు ఉన్న లబ్ధిదారులు ఈ-కేవైసీ తప్పనిసరిగా ఈ నెల 30 లోపు పూర్తి చేసుకోవాలని పెనుగొండ తహసీల్దారు జి.అనిత కుమారి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. లబ్ధిదారుల ఈ-కేవైసీ పెండింగ్ జాబితాలు రేషన్ డీలర్ల వద్ద ఉన్నాయని వివరించారు. పెండింగ్ ఉన్న వారందరూ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ-కేవైసీ పూర్తి చేయడానికి రేషన్ డీలర్లు, లబ్ధిదారులు, వీఆర్వోలు, వీఆర్ఏలు, ఎండీయూలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

భక్తులతో సోమేశ్వరుని ఆలయం కిటకిట



స్వామివారిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

పెనుమంట్ర: మాస శివరాత్రి, శనిత్రయోదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం జుత్తిగ గ్రామంలో శ్రీఉమావాసుకి రవిసోమేశ్వరస్వామి, నవగ్రహ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సోమేశ్వర స్వామివారికి పంచామృత అభిషేకాలు, నవగ్రహ ఆలయంలో శనేశ్వరునికి తైలాభిషేకాలు, నిర్వహించి అనంతరం స్వామివార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జుత్తిగలోని సోమేశ్వర ఆలయం మహిళా భక్తులతో పోటెత్తింది. అదేవిధంగా శనివారం మార్టేరులోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో కూడా స్వామివార్లకి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



మంత్రి రామానాయుడికి వినతిపత్రం ఇస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు

పాలకొల్లు సెంట్రల్: వైద్య ఆరోగ్యశాఖలో పని చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు గత వారం రోజులుగా నిరసన కార్యక్రమాలు చేస్తున్నారు. దీనిలో భాగంగా తమ సమస్యలను పరిష్కరించాలంటూ జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడుని కలిసి శనివారం వినతిపత్రం సమర్పించారు. దీనికి మంత్రి రామానాయుడు స్పందిస్తూ మీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి మీకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు.

రహదారి మూసివేతతో అవస్థలు

- మరమ్మతుల నిమిత్తం పెనుగొండ మార్టేరు రహదారి మూసివేత
- ఎండలో అల్లాడిపోయిన ప్రయాణికులు



పెనుగొండ-మార్టేరు రహదారిలో డ్రమ్ములు అడ్డుగా పెట్టిన దృశ్యం

పెనుగొండ: పెనుగొండ మార్టేరు రహదారి మూసివేత తొలిరోజే పల్లెల్లో అవస్థలు ప్రారంభమయ్యాయి. ముఖ్యంగా రైతన్నలు పడుతున్న బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. పెనుగొండ మార్టేరు రహదారిలో నరసాపురం ప్రధాన కాలువపై పెనుగొండలో ఉన్న ఫ్లైఓవర్ మరమ్మతులు, నెగ్గిపూడిలో కల్వర్టు నిర్మాణాలకు రోడ్లు భవనాల శాఖ పెనుగొండ మార్టేరు రహదారిలో రాకపోకలు నిలిపివేశారు. శనివారం ఉదయం పెనుగొండలో రహదారిని మూసివేశారు. శనివారం నుంచి మూసి వేసిన రహదారి తిరిగి జూన్ 10న తిరిగి ప్రారంభిస్తామని రోడ్లు భవనాల శాఖాధికారులు ప్రకటించారు. దీంతో పెనుగొండకు వాహనాలు రాకుండా రాజమండ్రి వెళ్లే వాహనాలను మార్టేరు, ఆచంట, ములపర్రుల మీదుగా సిద్ధాంతం నుంచి, తణుకు వెళ్లడానికి మార్టేరు నుంచి ఆలమూరు, ఇరగవరం మండలం మీదుగా వెళ్లడానికి దారి మళ్లించారు. శనివారం ఉదయమే పెనుగొండ ఫ్లైఓవర్ పనులు ప్రారంభించారు. దీంతో శనివారం ఉదయం నుంచి వాహనాలు ఆయా పల్లె గ్రామాల మీదుగా వెళుతున్నాయి.

ఇరుకు రోడ్లతో కిటకిట

వాహనాలు భారీగా వెళుతుండడంతో ఇరుకురోడ్లు కిక్కిరిసిపోతున్నాయి. ముఖ్యంగా ములపర్రు, ఇలపర్రు వంటి గ్రామాల్లో రహదారులు ఇరుకుగా ఉండడంతో వాహనదారులతో పాటు, గ్రామస్తులు నానా అవస్థలకు గురవుతున్నారు. గత కొంత కాలం క్రితం ఆచంట నుంచి సిద్ధాంతం వరకూ రహదారి విస్తరణ చేసినా గ్రామాల మధ్య రహదారులు ఇరుకుగానే ఉన్నాయి. దీంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు తప్పించుకోవడానికి నానా అవస్థలు పడుతున్నారు.

పల్లెను చూస్తున్న ఆర్టీసీ

గత కొంత కాలంగా పల్లెలను చూడని ఆర్టీసీ బస్సులు పల్లెల మీదుగా ప్రయాణిస్తుంటే ఏదో కొత్త వాహనాలు వచ్చినట్లుగా గ్రామస్థులు ఫీలవుతున్నారు. శనివారం ఉదయం నుంచి పల్లె గ్రామాల మీదుగా పల్లెవెలుగు బస్సులు ప్రయాణిస్తున్నాయి. ఓ వైపు గ్రామస్థులకు ఆర్టీసీ బస్సు రాక ఆనందాన్నిస్తున్నా.. ఇరుకు రోడ్లులో ఆర్టీసీతో పాటు ఇతర భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటే ఇబ్బందులకు గురవుతున్నారు. భారీ వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరిస్తే ఇబ్బందులు తొలగుతాయని ఆయా ప్రాంతాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ధాన్యం ఆరబోతకు ఇక్కట్లు

వాహనాల రాకపోకలతో ముఖ్యంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దాళ్వా సీజన్ పూర్తి కావడంతో ధాన్యాన్ని రోడ్లపైకి తెచ్చుకొని తేమ శాతం తగ్గించుకోవడానికి ఆరబెట్టుకుంటున్నారు. గ్రామాల్లో రోడ్లనే కళ్లాలుగా రైతులు వినియోగించుకుని ధాన్యాన్ని ఆరబెట్టుకుంటుంటారు. కోతలు ఇప్పుడిప్పుడే జోరు అందుకోవడంతో ఆయా గ్రామాల్లో మాసూళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ తరుణంలో వాహనాల రాకపోకలు అధికంగా ఉండడంతో కళ్లాలు లేక రైతులు అవస్థలు పడుతున్నారు.



పెనుగొండ ఫ్లై ఓవర్ పై ప్రారంభమైన మరమ్మతులు



ములపర్రులో రోడ్డు పక్కకు చేరిన గోనె సంచులు



పితానివారి పాలెం వద్ద కిక్కిరిసిన రహదారి

బస్సు సర్వీసుల రూట్ల మార్పు

నరసాపురం: మార్టేరు-పెనుగొండ రోడ్డు మరమ్మతులు, కల్వర్టు నిర్మాణం జరుగుతున్న కారణంగా నరసాపురం డిపో నుంచి రాజమండ్రి, తణుకు, నిడదవోలు వెళ్లే బస్సు సర్వీసుల రూట్లను కొన్ని రోజులపాటు మారుస్తున్నట్టు నరసాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్.సుబ్బన్నరెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రాజమండ్రి సర్వీస్‌లు మార్టేరు, ఆచంట, ఇలపర్రు సిద్ధాంతం మీదుగా, తణుకు, నిడదవోలు బస్సులు పాలకొల్లు, మార్టేరు, ఆలమూరు, కొంతేరు, ఇరగవరం, గోపాలపురం మీదుగా ప్రయాణిస్తాయని పేర్కొన్నారు. పెనుగొండ, పెరవలి మీదుగా మరమ్మతులు పూర్తయ్యేవరకూ బస్సు సర్వీసులు నడవవని స్పష్టం చేశారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

నేడు అన్నసమారాధన

పాలకొల్లు (సెంట్రల్): పంచారామ క్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం అఖండ అన్న సమారాధన నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ముచ్చర్ల శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఆలయ ప్రాంగణం వద్ద ఉదయం 11 గంటలకు అన్న సమారాధన ప్రారంభమవుతుందని, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి అన్న ప్రసాదం స్వీకరించాలని కోరారు.

స్పీడు బ్రేకర్లు వేయాలి

నరసాపురం: పట్టణంలోని స్టీమర్ రోడ్డు జంక్షన్ వైఎస్సార్ సెంటర్ ప్రాంతంలో స్పీడు బ్రేకర్లు వేయాలని పట్టణ వాసులు కోరుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో స్పీడు బ్రేకర్లు లేకపోవడంతో ప్రతిరోజూ ఏదో ఓ ప్రమాదం జరుగుతుంది. పట్టణంలో మొత్తం వ్యాపారమంతా దాదాపు ఇదే ప్రాంతంలో జరుగుతుంది. కూరగాయల మార్కెట్, చేపలు, కిరాణా మార్కెట్‌కు ఈ ప్రాంతం మీదుగానే వెళ్లాలి. ఇటీవల కాలంలో ఈ ప్రాంతంలో రద్దీ విపరీతంగా పెరిగిపోయింది. ఈ ప్రాంతంలో స్పీడు బ్రేకర్లు నిర్మిస్తే పరిస్థితి కాస్త మెరుగవుతుందని ప్రజలు కోరుతున్నారు.

మేధో సంపత్తి హక్కులపై వర్క్‌షాప్



మేధో సంపత్తి హక్కులపై వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక శ్రీ అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ అటానమస్ కళాశాలలో శనివారం ప్రపంచ మేధో సంపత్తి హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని రసాయన శాస్త్ర విభాగం ఐక్యూఏసీ-ఇన్‌స్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ విభాగాల ఆధ్వర్యంలో మేధో సంపత్తి హక్కులపై జాతీయస్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి మాట్లాడుతూ మేధోసంపత్తి హక్కులపై ఏర్పాటు చేసిన ఈ శిక్షణ శిబిరం పాల్గొన్న ఫ్యాకల్టీ, రీసెర్చ్ స్కాలర్స్, విద్యార్థులకు సంపూర్ణ అవగాహన ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్ ఐపీసీటీ సైంటిస్ట్ డాక్టర్ రాజు గుర్రపు, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ వి.యామిని, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి.కృష్ణ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ కె.భద్రాచలం తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



యలమంచిలి: కాంబొట్లపాలెంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

యలమంచిలి: ప్రకృతి వ్యవసాయాన్ని రైతులంతా ఒక ఉద్యమంగా చేపట్టాలని ప్రకృతి వ్యవసాయ డివిజన్ ఇన్‌చార్జి అప్పారావు కోరారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సాహించాలని కోరుతూ రైతులతో కలసి శనివారం కాంబొట్లపాలెం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం అందడమే కాకుండా వాతావరణంలో అనేక సానుకూల మార్పులు వస్తాయన్నారు. ప్రకృతి వ్యవసాయంలో ప్రధానమైన నవధాన్యాల సాగుకు రైతులంతా ఉపక్రమించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా గత 10 సంవత్సరాలుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతు కుక్కల లీలా కుమార్‌కు సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ అనిశెట్టి మల్లిక, పంచాయతీ కార్యదర్శి కె.దివ్య రైతులు వాసంశెట్టి కేశవరావు, అనిశెట్టి ప్రసాద్, అప్పారి వీరాంజనేయులు, అనిశెట్టి వెంకటేశ్వరరావు, బండి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: మండలంలోని అరట్లకట్ట గ్రామంలో ప్రకృతి వ్యవసాయం కేపీపీ 2025-26 ప్రణాళికకింద జోనల్ కోఆర్డినేటర్ వీరస్వామి అవగాహన కల్పించారు. ఎస్‌హెచ్‌జీ ద్వారా ప్రకృతి వ్యవసాయం ముందుకు వెళ్లాలని సూచించారు. అనంతరం గత 5సంవత్సరాలుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న గుండుబోయిన వెంకటేశ్వర్లుని సన్మానించారు. అనంతరం గ్రామంలో మోడల్ మండల్ టీం లీడర్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

పదవులు బాధ్యతగా నిర్వహించాలి



ముదునూరి ప్రసాదరాజును కలసి కృతజ్ఞతలు చెబుతున్న పాలకొల్లు పార్టీ నేతలు



గుడాల శ్రీహరి గోపాలరావును కలసి కృతజ్ఞతలు చెబుతున్న పార్టీ పాలకొల్లు మండల కన్వీనర్ పెన్మెత్స ఏసురాజు



యలమంచిలి: కంచుస్తంభంపాలెంలో ఎంపీటీసీ కడలి వెంకట సుబ్బలక్ష్మి, ఏడుకొండలు దంపతులను సన్మానిస్తున్న ఉచ్చుల స్టాలిన్‌బాబు

నరసాపురం: పార్టీ అప్పగించిన పదవులను బాధ్యతగా నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు సూచించారు. ఇటీవల కొత్తగా పార్టీ బాధ్యతలు చేపట్టిన పాలకొల్లు నియోజకవర్గ నేతలు శనివారం రాత్రి ముదునూరిని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పాలకొల్లు పార్టీ పట్టణ అధ్యక్షుడు కోరాడ శ్రీనివాస్, యలమంచిలి మండల అధ్యక్షుడు ఉచ్చుల స్టాలిన్, పాలకొల్లు రూరల్ అధ్యక్షుడు పెన్మెత్స యేసురాజు, పోడూరు మండల అధ్యక్షుడు కొప్రపాటి వీరాస్వామి ముదునూరిని కలిసి పార్టీ పరిస్థితిపై చర్చించారు. ఈ సందర్భంగా ముదునూరి మాట్లాడుతూ పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలో పార్టీ పదవులను సవాల్‌గా స్వీకరించి పని చేయాలని చెప్పారు. కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యింది అన్నారు. ప్రజలకు అండగా వారి సమస్యలపై పోరాడాలని సూచించారు.

అంకితభావంతో పని చేస్తా

యలమంచిలి: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీపై అంకిత భావంతో పని చేస్తామని వైఎస్సార్ సీపీ పాలకొల్లు మండల కన్వీనర్ పెన్మెత్స ఏసురాజు, పార్టీ జిల్లా సంస్థాగత కార్యదర్శి మైలాబత్తుల మైకేల్‌రాజు చెప్పారు. తమకు పదువులు వచ్చిన సందర్భంగా వారిరువురు శనివారం వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు, ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు చెల్లెం ఆనందప్రకాష్‌లను విడివిడిగా కలసి కృతజ్ఞతలు చెప్పారు. వారి వెంట పార్టీ నాయకులు కుంచనపల్లి విన్‌స్టన్‌బాబు, కర్ణి జోగయ్య, పునుకుమట్ల వీరాస్వామి, ఇస్సాక్, అన్నవరపు వెంకటరమణ తదితరులు ఉన్నారు.

పార్టీ అభివృద్ధికి కృషి

యలమంచిలి: పదవిని బాధ్యతగా స్వీకరించి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉచ్చుల స్టాలిన్‌బాబు కోరారు. ఎంపీటీసీ విప్, బూరుగుపల్లి ఎంపీటీసీ సభ్యురాలు కడలి వెంకట సుబ్బలక్ష్మి, భర్త కడలి ఏడుకొండలు పార్టీ జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన నేపథ్యంలో శనివారం పార్టీ నాయకులతో కలసి స్టాలిన్‌బాబు వారిరువురికి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఎన్నికల హామీలను అమలుచేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను ఏ విధంగా మోసగిస్తుందో ప్రజలకు వివరించాలని స్టాలిన్‌బాబు వారికి సూచించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు బోనం బులి వెంకన్న, వీరా ఉమా శంకర్, మంద హరికుమార్, పితాని శ్రీనివాస్ ఉన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న పెనుగొండ సీఐ రాయుడు

పెనుగొండ: విద్యార్థి స్థాయి నుంచి క్రమశిక్షణతో మెలుగుతూ ఉన్నత విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని పెనుగొండ సీఐ రాయుడు విజయకుమార్ అన్నారు. పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బంది చెల్లబోయిన ప్రభాకరరావు కుమార్తె చెల్లబోయిన ప్రణీత(589/600), చుక్కా నరేంద్ర కుమారుడు పవన్ వెంకట మణికిరణ్(563/600)లను శనివారం ఘనంగా సత్కరించారు. పోలీసు సిబ్బంది చిన్నారులను నరసాపురం డీఎస్పీ డాక్టర్ జి.శ్రీ వేద అభినందించారు. కార్యక్రమంలో పెనుగొండ, పెనుమంట్ర, ఆచంట ఎస్సైలు కొప్పిశెట్టి గంగాధర్, కె.స్వామి, కేవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

మందాలమ్మకు వెండి సమర్పణ



మందాలమ్మ ఆలయ కమిటీ సభ్యులకు వెండిని అందిస్తున్న దాతలు

పెనుగొండ: వడలి గ్రామ దేవత మందాలమ్మకు మారుతి మెడికల్స్ తుమ్మలపల్లి శ్రీ కృష్ణమూర్తి కుటుంబ సభ్యులు అరకేజీ వెండి సమర్పించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం మందాలమ్మ అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించిన అనంతరం కమిటీ సభ్యులకు అమ్మవారికి వెండి వస్తువులు తయారీ నిమిత్తం వెండిని అందించారు. దాతలకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

మందాలమ్మ సేవలో ఎమ్మెల్యే పితాని

వడలి గ్రామ దేవత మందాలమ్మను ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ దర్శించుకున్నారు. మందాలమ్మ తీర్థ జాతర మహోత్సవాలు సందర్భంగా శనివారం ఉదయం అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం వడలిలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే పితాని సత్యనారాయణను ఘనంగా సత్కరించారు.

రేపటి నుంచి గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు

పెనుమంట్ర: మండలంలోని మార్టేరు శాఖ గ్రంథాలయంలో సోమవారం నుంచి జూన్ 6 వర కు వేసవి విజ్ఞాన శిబిరాలను నిర్వహిస్తా మని గ్రంథాలయ అధికారి పీటీఎస్ కుమార్ తెలి పారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 8 గంటల నుండి 11గంటల నిర్వహించే ఈ శిబిరాలను విద్యార్థు లు వినియోగించుకోవాలని సూచించారు.

కవిత్వం, కథల్లో కొత్త తరాన్ని తయారు చేయాలి



కథా కుసుమాలు సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న రచయితలు

నరసాపురం రూరల్: కవిత్వం, కథల్లో కొత్త తరాన్ని తయారు చేయాలని అందుకు గానూ ఉన్నత పాఠశాలల్లో, కళాశాలల్లో ప్రస్తుతం ఉన్న కథకులందరూ వెళ్లి యువతను సాహిత్యపరంగా చైతన్య పరచాలని ప్రముఖ కథ, నవలా రచయిత, విశ్రాంత ఉపాధ్యాయుడు నమ్మి కనక నాగేశ్వరరావు అన్నారు. శనివారం పట్టణంలోని అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో తెలుగు కథకులు రాసిన కథల నుంచి 45 కథలను ఎంపిక చేసి కథా కుసుమాలు పేరుతో ద్వితీయ సంకలనంగా ఆవిష్కరించారు. జిల్లాల్లో పుట్టి పెరిగి ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఉంటున్న రచయితలంతా కలసి గతంలో ఇదే ప్రాంగణంలో కథా కిరణాలు పేరుతో మొదటి సంకలనం వెలువరించిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. బాపూశ్రీ చేతుల మీదుగా కథాకుసుమాలు పుస్తకాన్ని ఆవిష్కరించగా జొన్నవిత్తుల రామచంద్రరావు సంకలనంలోని కథల గురించి సమీక్ష చేశారు. కార్యక్రమంలో పుస్తక సంపాదకులు పాకోడేటి సత్యనారాయణ మాట్లాడుతూ ఈ యుగంలో పుస్తక ప్రచురణ ఒక యజ్ఞం అని ఈ పుస్తకం కథల ఎంపిక నుంచి ముద్రణ వరకూ పలు విషయాలను, కథల ఇతివృత్తాలను వివరించారు. అనంతరం తమ్మా సత్యనారాయణ రాసిన భక్త మార్కండేయ (పద్య నాటకం), జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి రచించిన సాక్షాత్కారం, డాక్టర్ మట్టా సుగుణరావు రచించిన ఫనల్ డయాగ్నోసిస్ నవలలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బాపూశ్రీ, రెడ్డప్ప దవేజీ, ప్రముఖ కార్టూనిస్టు సరసి, సుధీర్ మోహన్, ఎన్కే నాగేశ్వరరావు, బాలామణి, నాగేశ్వరి, చెంగల్వల కామేశ్వరి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

రఘురామకృష్ణరాజు క్షమాపణలు చెప్పాలి



అంబేద్కర్ సెంటర్‌లో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

నరసాపురం: పేదల పక్షాన మాట్లాడిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు బహిరంగ క్షమాపణలు చెప్పాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కవురు పెద్దిరాజు డిమాండ్ చేశారు. రఘురామకృష్ణరాజు తీరును నిరసిస్తూ శనివారం స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా పెద్దిరాజు మాట్లాడుతూ రఘురామకృష్ణరాజు ఓ రాష్ట్ర రాజకీయనేతను వ్యక్తిగతంగా దూషించడం దారుణమన్నారు. కార్యక్రమంలో ముచ్చర్ల త్రిమూర్తులు, నోముల కొండ,బూడిద జోగేశ్వరరావు, పొగాకు నారాయణరావు, కోడి లక్ష్మణ్, కోరాడ బద్రి పాల్గొన్నారు.

పట్టణ సుందరీకరణలో మునిసిపాలిటీ నిర్లక్ష్యం



మట్టిదిబ్బలతో దర్శనమిస్తున్న లాకు రోడ్డు

నరసాపురం: పట్టణ సుందరీకరణ విషయంలో మున్సిపల్ అధికారులు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఫలితంగా వనరులన్నీ అందుబాటులో ఉండి కూడా పట్టణ పరిస్థితి దారుణంగా తయారవుతుంది. ఎక్కడబడితే అక్కడ రోడ్డు పక్కన పిచ్చిమొక్కలు, మట్టి దిబ్బలు దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా లాకుల నుంచి కొండాలమ్మ గుడి వరకూ గోదావరి గట్టు వెంబడి పరిస్థితి దారుణంగా ఉంటుంది. అలాగే మత్స్యపురి వంతెన నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకూ పంట కాలువ వెంబడి నిర్మించిన ప్లాట్‌ఫామ్, రెయిలింగ్ ధ్వంసమైంది. కొండాలమ్మగుడి ప్రాంతంలో మార్బుల్స్ రెయిలింగ్ చోరుల పాలవుతోంది. ముఖ్యంగా గోదావరి బండ్‌కు వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన మట్టిదిబ్బలు దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి పరిస్థితిపై దృష్టి సారించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

వైభవంగా తిరునక్షత్ర ఉత్సవాలు

నరసాపురం రూరల్: స్థానిక శ్రీ ఆదికేశవ ఎంబెరుమానార్ స్వామి వారి బ్రహ్మోత్సవ, తిరునక్షత్ర ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ నెల 12న ప్రారంభమైన బ్రహోత్సవాలు 22వ తేదీ వరకు నిర్వహించారు. అనంతరం 23న ప్రారంభమైన తిరునక్షత్ర ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ప్రతీ రోజూ స్వామివారికి తిరుమంజనం, లీలా విభూతి ఉత్సవం, పల్లకిలో అగ్రహారోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. శనివారం రాజాధిరాజ వాహనంలో స్వామివారు తిరువీధుల్లో ఊరేగారు. ఆలయ కార్యనిర్వహణఅధికారి, సిబ్బందితో కలసి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

ప్రోత్సాహకాల అందజేతకు దరఖాస్తుల ఆహ్వానం

పెనుమంట్ర: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ప్రోత్సాహకాలు అందిస్తామని జిల్లా రెడ్డి సేవా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల లక్ష్మణరెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మెరిట్ సాధించిన 20 మంది విద్యార్థులను ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేస్తామని స్పష్టం చేశారు. ఈ ఎంపికలో మొదటి పది మందిని అన్ని కులాల్లోనూ మెరిట్ సాధించిన విద్యార్థులను ఎంపిక చేస్తామని, మిగిలిన పది మందిని రెడ్డికులానికి చెందిన వారిని మాత్రమే ఎంపిక చేసి విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను కూడా సత్కరిస్తామన్నారు. ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది మెరిట్ సాధించిన విద్యార్థులు, తల్లిదండ్రులు మే 5 లోపు 96669 99799, 944110 11900 , 94904 33666, 7288866658 నంబర్లకు ఫోన్ చేసి తమ వివరాలను తెలియజేయాలని సూచించారు.